క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నాయకులు

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్‌లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు మండల ఇన్‌చార్జి చిట్టిరవి తెలిపారు. అధ్యక్షుడిగా ఉప్పులేటి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సోన్న రాజేశ్వర్, కోశాధికారిగా సోన్న రుతిక్, ప్రచార కార్యదర్శిగా ఉప్పులేటి లక్ష్మణ్, సలహా సభ్యులుగా దాసరి లక్ష్మణ్, లచ్చన్న, నరేశ్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఎన్‌టీఆర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె)లో శనివారం నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రేసుపోతారెడ్డి మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన మహానీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే వలి, గంగయ్య, కళ్లా దివకర్‌రెడ్డి, తోట లచ్చన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను హతమారిస్తే జైలుకే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అటవీశాఖ అధికారులు

బోథ్: వన్యప్రాణులను హతమారిస్తే మూడు నుంచి ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందని బోథ్ రేంజ్ అటవీశాఖ అధికారి ప్రణయ్ కుమార్ అన్నారు. అటవీ సంరక్షణ–వన్యప్రాణుల సంరక్షణ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవులను నరకడం, వన్య ప్రాణులను ఉచ్చుపెట్టి, కరెంటు పెట్టి చంపితే చట్ట రీత్యా నేరమన్నారు. పులులు సంచరిస్తున్న నేపథ్యంలో రైతులు చేలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి అమర్ సింగ్, ఎఫ్ఎస్‌వో నాగోరావ్, ముంతాజ్, జూనియర్ అసిస్టెంట్ పరశురామ్, ఎఫ్ఆర్‌వో సంధ్యరాణి, నాగోరావ్, ధన్‌రాజ్, అనిల్, రాధేశ్యం పాల్గొన్నారు.

మైక్‌సెట్ విరాళం

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన వివేకానంద యూత్ సభ్యులు గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు రూ.5 వేల విలువల గల మైక్‌సెట్‌ను శనివారం విరాళంగా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందిస్తామన్నారు. ఉపాధ్యాయులు, వివేకానంద యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ గ్రామంలో మహాదేవ్ జాతర సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా డీజే సాలెవాడ జట్టు, రన్నరప్‌గా ఉమ్రి కొలాంగూడ గెలుపొందింది. అనంతరం గెలుపొందిన జట్టుకు నగదు బహుమతి అందజేశారు. మాజీ సర్పంచ్ నందకుమార్, నిర్వాహకులు అవినాశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల సర్వే



వివరాలు సేకరిస్తున్న ఎంఈవో

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో శనివారం సీఆర్పీ రవీందర్ బడిబయటి పిల్లల (ఓఎస్‌సీ) సర్వే చేపట్టారు. ఎంఈవో శ్యాంసుందర్ కలిసి గ్రామంలో సర్వే చేపట్టగా గ్రామానికి చెందిన షేక్ తోఫిక్ అనే బాలుడి మధ్యలో చదువు మానేసి మేకల కాపరిగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. బాలుడి ఇంటికి వెళ్లి పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అందించే వసతులను వివరించారు. వారి వెంట ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు ఉన్నారు.

భళారే చిన్నారి చిత్రం



వివిధ గెటప్‌లలో చిన్నారులు

ఫొటోషూట్ చేస్తున్న దృశ్యం

సండే స్పెషల్

మనిషి జీవితంలో బాల్యానిది ప్రత్యేక స్థానం. బుడిబుడి నడకలతో చిన్నారులు వేసే అడుగులు, ముద్దు ముద్దు మాటలతో వారు పలికే పలుకులు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులను మురిపిస్తాయి. ఈ మధురమైన గుర్తులు చిరకాలం నిలిచిపోయేలా పేరెంట్స్ బేబీఫొటో షూట్స్‌పై మక్కువ చూపుతున్నారు. తమ బుజ్జాయిలు ఫొటోలకు ఫోజులు ఇస్తుంటే.. ఆ జ్ఞాపకాలు చిత్రాల్లో బంధించి మురిసిపోతున్నారు. – ఆదిలాబాద్

- పదిలంగా పిల్లల జ్ఞాపకాలు
- బేబీ ఫొటోషూట్లపై తల్లిదండ్రుల ఆసక్తి
- ఇండోర్ థీమ్స్ స్టూడియోలకు ఆదరణ

ఆకట్టుకుంటున్న బేబీ స్టూడియోలు..

గతంలో చిన్నారులకు నామకరణం, అన్నప్రాసన, పుట్టినరోజు, కేశ ఖండనం, అక్షరాభ్యాసం వేడుకలను నిర్వహించి, ఆ చిత్రాలను ఫొటోలు తీయించుకునేవారు. అయితే మారుతున్న కాలంతో పాటు, ఫొటోగ్రఫీలో వచ్చిన ట్రెండ్స్ ప్రభావంతోనూ ఈ బేబీ ఫొటో షూట్స్ వెలుగులోకి వచ్చాయి. ఇప్పుడు విభిన్నమైన థీములతో ఇండోర్ స్టూడియోలు ఏర్పాటు చేసి అందులోనే చిన్నారులను అందంగా కెమెరాల్లో బంధిస్తున్నారు.

పసికందు నుంచి ఫస్ట్ బర్త్ డే దాకా..

పుట్టినప్పటి నుంచి 15 రోజులకు, 21 రోజులకు పసికందుగా ఉన్నప్పటి నుంచి వారు ఎదుగుతూ ఉండగా ఒక్కోనెల ఒక్కో రకంగా వారిని అలంకరించి ప్రత్యేకంగా ఫొటోలు తీయిస్తున్నారు. అదే విధంగా ఫస్ట్ బర్త్ డేకి మరింత ప్రత్యేకంగా వారిని ఒక్కో గెటపులో మేకప్ చేసి అన్ని విధాలుగా వారిని తయారు చేస్తున్నారు. వారిని కెమెరాలలో బంధింపజేస్తూ, వాటిని ప్రత్యేక ఆలబ్ములుగా, డాక్యుమెంటరీలు, వీడియోలుగా భద్రపరుచుకుంటున్నారు.

ఆదరణ పెరుగుతోంది..



చిన్నారుల చిత్రాలను జ్ఞాపకాలుగా దాచుకునేందుకు బేబీ ఫొటో స్టూడియోలు ఎంతగానో దోహదం చేస్తాయి. తల్లిదండ్రుల ఇష్టాలకు అనుగుణంగా చిన్నపిల్లలను వివిధ గెటప్‌లో అలంకరించి ప్రత్యేక నైపుణ్యంతో కెమెరాల్లో బంధిస్తున్నాం. ప్రస్తుతం బేబీ స్టూడియోలకు ఆదరణ పెరుగుతోంది.

– రామెల్లి శంకర్, బేబీ ఫొటోస్టూడియో నిర్వాహకుడు, ఆదిలాబాద్



ఫొటోషూట్ కోసం ఏర్పాటు చేసిన సెట్టింగ్

మారని అధికారుల పేర్లు



నేరడిగొండ మండల వ్యవసాయ శాఖ అధికారులు బదిలీపై ఇతర చోటికి వెళ్లినా స్థానిక కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో మాత్రం వారి పేర్లు అలాగే దర్శనమిస్తున్నాయి. కొత్తగా వచ్చి విధులు చేపడుతున్న అధికారుల పేర్లు ఆ బోర్డుకెక్కడం లేదు. దీంతో ఏ అధికారులు ప్రస్తుతం పని చేస్తున్నారనే విషయం ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ప్రస్తుతం పనిచేస్తున్న అధికారుల పేర్లు ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

– నేరడిగొండ

గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని దర్బతండా గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12లక్షలతో శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే సీసీరోడ్ల నిర్మాణానికి సైతం రూ.5 లక్షలతో పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మండల మాజీ ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, అల్లూరి శివారెడ్డి, ఉప్పు పోశెట్టి, జహీర్, జాదవ్ సుజీల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నేరడిగొండ: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు మసీద్ కమిటీ సభ్యులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు.

ఘనంగా గోదారంగనాథ స్వామి కల్యాణం



పూజలు చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన గోదారంగనాథ స్వామి కల్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులతో కలిసి అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుల్లి గంగన్న, లోక కృష్ణారెడ్డి, మాధస్తు రాజన్న, దేవర్తి గణేష్, నల్లగొండ అశోక్, కుషన్‌పెల్లి రాజన్న, గంగ్రత్ రమేశ్, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, రాజన్న, జగదీష్, బట్ట సతీష్, పవన్ నాయక్ పాల్గొన్నారు.

పకడ్బందీగా రైతుభరోసా సర్వే



సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఇచ్చోడ: రైతుభరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటుగా, బబూల్‌దోల్, కోకస్‌మన్నూర్ శివారులో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. వ్యవసాయ యోగ్యం లేని భూములను గుర్తిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్, పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఏఈవో సుప్రియ, తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: అర్హులైన రైతులందరికీ రైతుభరోసా వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి అన్నారు. శనివారం మండలంలోని తేజాపూర్ రైతు వేదికలో రైతుభరోసాపై రైతులతో సమావేశం నిర్వహించారు. సాగులో ఉన్న భూమి వివరాలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సందేహాలు ఉంటే స్థానిక ఏఈవోల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి రవీందర్, రైతులు, గ్రామస్తులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఇచ్చోడ: మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. శనివారం ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సూపర్ చెక్ సర్వే నిర్వహించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితా ప్రకారం సూపర్ చెక్ సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఏమాయికుంట గ్రామానికి చెందిన ఈగల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. యువత అన్నిరంగాల్లో రాణిస్తున్న చదువుపై దృష్టి సారించాలన్నారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, మాజీ ఎంపీపీ పోటే శోభాబాయి, మడావి భీంరావ్, మహ్మద్ అంజద్ పాల్గొన్నారు.

మహాదేవ్ ఆలయంలో పూజలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ(కె) గ్రామంలో హరహర మహదేవ్ శివాయంలో బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి భుక్య జాన్సన్ నాయక్ ప్రత్యేక పూజలు చేశారు.

సభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆరెల్లి మల్లేశ్

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఈనెల 22న నిర్వహించే సన్నాహక సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక ద్రోహులకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గైక్వాడ్ సూర్యకాంత్, వినయ్, సాగర్, రాజేష్, సూర్య ప్రసాద్, మురళి, శంకర్, దీపక్, జైసింగ్ పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న వైద్యాధికారులు

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న బొంకంటి సుభాశ్, సభ్యులుగా మహేశ రెడ్డి, భానుప్రసాద్‌లకు చోటు దక్కింది. కాగా శనివారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్ వారిని ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, సాజిద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేయిచేయి కలిపారు.. రోడ్డు నిర్మించారు



పిప్రిలో రోడ్డు వేస్తున్న రైతులు

ఇచ్చోడ: సొంత డబ్బులతో రైతులు తమ పంట పొలాలకి వెళ్లేందుకు శనివారం రోడ్డు పనులు ప్రారంభించారు. బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన కొంత మంది రైతులకు వర్షాకాలంలో పొలంలోకి వెళ్లాలంటే బురదతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో 20 మంది రైతులు తల కొంత డబ్బును జమ చేసి రోడ్డు నిర్మించుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు రోడ్డు నిర్మిస్తామని చెప్పి ఇప్పటికీ నిర్మించలేదన్నారు. కార్యక్రమంలో రైతులు బొంగురాల నరేందర్, గిరి, మనోజ్, రాజ్ కుమార్, రమేశ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గుడురు రాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం

బోథ్: మండల కేంద్రంలోని 10వ వార్డులో కల్వర్టు లేక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై కాలనీ వాసులు స్థానికుడు చట్ల ఉమేశ్‌కు సమాచారం అందించగా.. సొంత డబ్బులతో కల్వర్టు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కాగా శనివారం కల్వర్టు పనులను ప్రారంభించారు. ఉమేష్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నేరడిగొండ: మండలంలోని తేజపూర్ గ్రామస్తులకు అండగా ఉంటానని బోథ్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి అన్నారు. తన సొంత గ్రామమైన తేజపూర్ గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీలో గత ప్రభుత్వంలో సీసీరోడ్డు నిర్మించి కల్వర్టు మర్చిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఇటీవల ఆయన దృష్టికి తీసుకురాగా, స్పందించి శనివారం తన సొంత డబ్బులతో కల్వర్టును నిర్మించడంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు.


సమస్యల పరిష్కారానికి కృషి



సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సునీత

నేరడిగొండ: సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బుగ్గారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత ఆడే గజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని తెలిపారు. వెంటనే బోర్ మోటర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావ్, రాజశేఖర్ రెడ్డి, రమేశ్, కపిల్, సద్దాం, రాజేశ్, వెంకటరమణ, లీలావతి, సురేఖ పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటాం



సరుకులు అందజేస్తున్న సంతోష్

ఇంద్రవెల్లి: ఆపదలో ఉన్న పేదలను ఆదుకుంటామని హైమన్‌డార్ఫ్ బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్వ సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని సందర్శించి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆత్రం మారుతి కుటుంబసభ్యులను పరామర్శించారు. నెల రోజులకు సరిపడా సరుకులు, బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్‌గౌడ్, మడావి తెలంగ్‌రావ్, భీంరావ్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రూపేష్ రెడ్డి

కైలాస్‌నగర్: బేల మండలంలోని సాంగిడి గ్రామానికి మంజూరైన అంగన్‌వాడీ భవనానికి స్థలం కేటాయించాలని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం రూ. 12 లక్షలు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అనువైన స్థలం ఉందని కలెక్టర్‌కు విన్నవించారు. అందుకు స్పందించిన కలెక్టర్ భవన నిర్మాణానికి అవకాశం కల్పించాలని అక్కడే ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతను ఆదేశించినట్లుగా తెలిపారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా

ఇచ్చోడ: ఇంటర్ పాసైన ప్రతీ విద్యార్థి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా అన్నారు. శనివారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2025–26 సంవత్సరం అడ్మిషన్ల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిష్ణతులైన అధ్యాపకులు ఉంటారని, అడ్మిషన్లు తీసుకొని తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు సరస్వతి, అనిత, మురళి, సరిత, తిరుపతి, ప్రభాత్‌రావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

రుణాలు చెల్లించి సంఘ అభివృద్ధికి పాటుపడాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరడిగొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి పాటుపడాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు కలాలి వెంకట రమణ అన్నారు. శనివారం మండలంలోని వడూర్‌లో పీఏసీఎస్ సంఘ కార్యాలయ ఉద్యోగులతో కలిసి రుణాల రికవరీ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ద్వారా వ్యవసాయ రుణాలతో పాటు వ్యాపార రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించి సహకరించాలన్నారు. బంగారంతో పాటు గృహాలపై సైతం రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ కార్యాలయ ఉద్యోగులు గంగయ్య, రజిని, కొప్పుల సంతోష్, బొలిశెట్టి రెడ్డి, తెడ్డు అశోక్, ఎరడ్ల చంద్రశేఖర్ ఉన్నారు.

గ్రామాల్లో కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ సాంస్కృతిక సారధి కళాజాత బృందం ద్వారా నాగాపూర్, చెరువుగూడ, జెండగూడ గ్రామాల్లో ప్రజలకు శనివారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నేషనల్ హెల్త్ మిషన్, రోడ్డు భద్రత, క్షయ, డెంగ్యూ, మలేరియా, మన తెలంగాణ మన వ్యవసాయం, మాదక ద్రవ్యాలపై, కుటుంబ నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి విజయలక్ష్మి, టీం కోఆర్డినేటర్ గోవింద్‌రావు, శంకర్, ఆశిష్, నగేశ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.